క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశం

నర్వ: నేడు మండల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశం శనివారం సాయంత్రం 4గంటలకు నిర్వహిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, 7 నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అంజయ్యయాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశానికి అన్నిగ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో గురులోకామాసంద్ ప్రభు (బావాజీ) జాతర ఈ నెల 22నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అప్పటివరకు తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, రోడ్డు మార్గం నిర్మాణాలు పూర్తిచేయాలని ఎంపీడీఓ జయరాములు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం అక్కడ జరిగే పనులను పరిశీలించారు. అనంతరం నిడ్జింత గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లిలో శుక్రవారం మాజీ సర్పంచ్ చాకలి నర్సింహులు అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, నాయకులు కావలి సాయప్ప, సూర్యప్రకాష్‌రెడ్డి, కతలప్ప తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్‌గట్‌లో ప్రీస్కూల్ వార్షికోత్సవం



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని దుప్పట్‌గట్‌లోని అంగన్‌వాడీ 1, 2 కేంద్రాల్లో శుక్రవారం ప్రీ స్కూల్ చిన్నారులు, వారి తల్లులు, గర్భిణులు, బాలింతలతో కలిసి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. గ్రామ పరిధిలోని అంగన్‌వాడీలన్నీ కలిసి వీరికి అందించాల్సిన పౌష్టికాహారంపై అవగాహనతోపాటు వాటిని అందజేశారు. విద్యాభ్యాసంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, భాగ్యలక్ష్మి, స్కూల్ టీచర్ పద్మ, ఆశ కార్యకర్తలు మహేంద్రమ్మ, రాధ పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప బండారు ఉత్సవం

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో శుక్రవారం కుర్వ సంఘాల ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ వీరలింగేశ్వరస్వామి బండారు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుర్వ సంఘం ఆధ్వర్యంలో అరుణమ్మను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, ఎంపీటీసీ శివ, కుర్వ ఆశప్ప, బలరాంరెడ్డి, వెంకటరాములు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించండి

ఆత్మకూర్: మున్సిపాలిటీకి నాలుగు దిక్కుల మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని కోరుతూ చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజుకు సీపీఐ మండల నాయకులు వినతి పత్రం శుక్రవారం అందించారు. కొత్తకోట రోడ్డు వైపు, అమరచింత వైపు, పాత పంచాయతీ, ప్రభుత్వ ఆస్పత్రి, మటన్ మార్కెట్ దారిలో ప్రతి నిత్యం వేలాది సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారని తెలిపారు. ప్రజల, ప్రయాణికుల అవసరాల నిమిత్తం తక్షణమే మరుగుదొడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీహరి, రాబర్ట్, మోష, సీఎస్ శెట్టి, లింగన్న, బాలరాజు తదితరులు ఉన్నారు.



భానుడి భగభగ

- రోజురోజుకూ తీవ్రమవుతున్న ఎండలు.. వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరి
- బయటకు రావాలంటేనే జంకుతున్న జనం
- మండలంలో 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు



ఎండల కారణంగా నిర్మానుష్యంగా మారిన రాయచూర్ రోడ్డు



ఎండలకు తాళలేక తువాళ్లు అడ్డుపెట్టుకొని వెళ్తున్న కూలీలు

మరికల్: ఉదయం 9 అయ్యిందంటే చాలు భానుడు విశ్వరూపం చూపిస్తున్నాడు. జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. 43 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం బెంబేలెత్తుతున్నారు. సాయంత్రం 6 గంటల వరకు ఎండలు మండటంతో ఓ పక్క కష్టజీవులు, మరోపక్క మూగజీవులు మండుటెండలకు అల్లాడుతున్నారు. రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. పక్షం రోజుల నుంచి ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ఉపాధి కూలీలు ఎండలకు పనులు చేయలేకపోతున్నారు. దీంతో వారికి గిట్టుబాటు కూలీ రాకపోవడంతో నిరుత్సాహంతో ఉన్నారు. ఎండల నుంచి ఉపసమనం పొందేందుకు ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచిస్తోంది.

వడదెబ్బకు కారణాలు

ఎండలు ఎక్కువగా ఉన్న చోట్ల అధిక శ్రమతో కూడిన పనిచేస్తున్నప్పుడు ప్రతిగంటకు మూడు లేక నాలుగు లీటర్ల నీటిని చెమట రూపంలో మన శరీరం కోల్పోతుంది. శరీరం ఉప్పు కన్నా ఎక్కువ నీటిని కోల్పోతే వడదెబ్బ తగులుతుంది. నీటి కంటే ఉప్పుశాతం చెమట ద్వారా పోతుంటే దాహం అంతగా ఉండదు. నీరు బాగా తాగి ఉప్పు మాత్రం సరైనంత తీసుకోకపోతే వడదెబ్బ తగిలే అవకాశముంది. వడదెబ్బకు ఎక్కువగా గురయ్యేదెవరంటే 50–65 ఏళ్ల వయస్సు పైబడిన వారు, పసిపిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు అనారోగ్యంతో బాధపడుతున్న వారు, గుండెజబ్బులు, అధిక రక్తపోటు ఉన్నవారికి అవకాశం ఉంది.

ప్రథమ చికిత్స..

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. అతని శరీరంపై ఉండే దుస్తులను తొలగించి చల్లని నీటితో కడగటం కాని, చల్లని నీటితో ముంచిన గుడ్డతో తుడవటం చేయాలి. ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరమంతాట రుద్దితే చాలా మంచింది. శరీరమంతా చల్లని గాలి తగిలేలా చూడాలి. రోగులను చల్లని నీరు లేదా ఉప్పు, ఇతర లవణాలను కలిపిన నీటిని తాగించాలి, వడదెబ్బ తగిలి అపస్మారకస్థితిలో ఉన్న రోగిని నీరు తాగించొద్దు. ప్రథమ చికిత్స చేసి వెంటనే ఆస్పత్రికి తరలించాలి. స్పృహ కోల్పోతే మాత్రం సమయం వృథా చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎక్కువగా నీరు, ద్రవ పదార్థాలను సేవించడం మంచిది, (అతి శీతల పానియాలు తాగరాదు)
- సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ఎండలో తిరగరాదు.
- తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితిలో ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పళ్లరసాలు తాగాలి. గొడుగును ఉపయోగించాలి.
- వేసవి కాలంలో తెల్లని దుస్తులు, తలకు టోపీ లేదా రుమాలు పెట్టుకోవాలి. నల్లని వస్త్రాలు ధరించకూడదు.
- మద్యం తాగడంతో రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. ఇది విషమ పరిస్థితికి దారితీస్తుంది. మద్యం తాగకపోవడం మంచిది.
- ఇంటి గదులు ఉష్ణోగ్రతను తగ్గించడానికి కిటికీ తలుపులు తెరలను వాడాలి. ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండీషనర్లు ఉపయోగించుకోవాలి.
- ఎండలో పనిచేయాల్సి వచ్చినప్పుడు ప్రతి 20 నిమిషాలకోసారి ద్రవ పదార్థాలను తీసుకుంటూ చల్లటి కుండలో నీటిని తాగడం చాలా మంచిది.

ఎక్కువగా నీటిని తాగాలి

వేసవిలో రోజుకు 5 లీటర్లకు పైగా నీటిని తాగాలి. నీరు తక్కువగా తాగిన వారికి ఎండలో తిరిగే వారికి వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. వడదెబ్బ తగిలిన వ్యక్తికి ముందుగా ప్రథమ చికిత్స చేసి వైద్యులను సంప్రదించాలి. చల్లని ప్రాంతంలో కూలీలు పనులు చేసేలా చూసుకోవాలి. వేసవిలో పనులు చేసేవారు డాక్టర్ సలహాలు, సూచనలు పాటించాలి.

– డాక్టర్ రాఘవేంద్రరెడ్డి, మరికల్

నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ రాజేశ్వరి

కోస్గి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిర్దేశిత లక్ష్యం మేరకు నర్సరీలో మొక్కలను పెంచి సంరక్షించాలని డీఆర్‌డీఓ రాజేశ్వరి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని చెన్నారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నిర్మించిన డంపింగ్ యార్డును, నర్సరీతోపాటు ఉపాధి పనులను తనిఖీ చేశారు. వేసవి ఎండలు ఎక్కువైన నేపథ్యంలో మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షకాలం ప్రారంభం నాటికి గ్రామాల వారిగా నిర్దేశిత లక్ష్యం మేరకు పంపిణీ చేసేందుకు మొక్కలను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కోస్గి ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిలో సమీక్ష సమావేశం నిర్వహించి కొనసాగుతున్న పనులు, కూలీల వివరాలు, ఇతర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సింహులు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మద్దూరు: మండలంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలలో 1998–99 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. మద్దూరుకు చెందిన మహమ్మద్ బషీర్ ఇటీవలే అకాల మరణం చెందారు. ఈ కుటుంబ పోషణభారంగా మారడంతో స్నేహితులందరూ కలిసి రూ.60 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం తల్లీ షరీఫా బేగంకు అందజేశారు. భవిష్యత్‌లో ఏ అవసరం వచ్చిన మమ్మల్ని సంప్రదించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నర్సింహ, బాలరాజ్, రామకృష్ణ, రాజునాయక్, షాహలం, మరళి, శంకర్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక..

కోస్గి: పాలమూరు బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు బీజేపీలో చేరారు. కొడంగల్ అసెంబ్లీ కో –కన్వీనర్ కోటకొండ రాము సమక్షంలో గుండుమాల్ మండల పరిధిలోని హన్మాన్‌పల్లికి చెందిన మాజీ సర్పంచ్ దామోదర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటయ్య, వార్డు సభ్యులు రాములు, మల్లప్ప, రాజు, నరేందర్‌తోపాటు పలువురు పార్టీలో చేరారు. పాలమూరు జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వీరందరు పార్టీలో చేరగా డీకే అరుణ కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు. ప్రధాని మోదీ పాలన నచ్చి బీజేపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ప్రతాప్‌రెడ్డి, రమేష్, మహేందర్, వెంకటేష్,కల్యాణ్, మహేష్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో డీకే అరుణ

టెక్నికల్ అసిస్టెంట్ల నూతన కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు తన సంఘం జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవికుమార్, గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా యాదవరాజు, మహిపాల్‌రెడ్డి, భానుప్రియ, ప్రధాన కార్యదర్శిగా శంకరయ్య, సహాయ కార్యదర్శిగా హర్షవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా ఊషన్న, కార్యనిర్వహణ కార్యదర్శిగా గౌరీశంకర్, ప్రచార కార్యదర్శులుగా లక్ష్మీనారాయణ, గోపాల్, శ్రీకాంత్, మహాలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా గోపాల్, ప్రవీణ్, శ్రీనివాస్‌రావు, మోహన్, వీరేష్‌లను సభ్యులుగా నియమించారు.


ఘనంగా స్వయంపాలన దినోత్సవం



అంగన్‌వాడీ చిన్నారులతో టీచర్లు

దామరగిద్ద: అంగన్‌వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక విద్యతోపాటు ఆరోగ్యాన్ని అందించే విద్యా కేంద్రాలుగా నిలుస్తున్నాయని హెచ్‌ఎం అంబరీష్, ప్రథమ్ ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ కవిత అన్నారు. శుక్రవారం మండలంలోని ఉద్మల్‌గిద్దలో స్థానిక అంగన్‌వాడీ టీచర్‌లు రాధమ్మ, శకుంతల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. చిన్నారులకు స్థానికంగా లభించే వివిధ భోదన ఉపకరణతో లెక్కలు చదవడం, రాయడం, అంకెలు, ఆల్ఫాబెట్స్ నేర్పారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలో అందించే పౌష్టికాహారంతోపాటు ఆరోగ్య సలహాలు సూచనలు, పిల్లల ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నారని తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ 3–5 లోపు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పి ప్రయోజనం పొందాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశకార్యకర్తలు కరుణశ్రీ, చంద్రమ్మ, ఆయాలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వ్యాపార కేంద్రాల వద్ద శుక్రవారం సిబ్బంది ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విన్యాసాలతో వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలు ప్రమాదాల బారిన పడ్డప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, రాముడు, సందీప్‌రెడ్డి, భానుచందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించండి



నందిమళ్లలో మొక్కలకు నీటిని అందిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

అమరచింత: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నందిమళంలలో చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలకు నీరు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి కాకుండా మొక్కల ప్రదేశంలో చెత్తచెదారం ఉంటే వాటిని తొలగించాలని సూచించారు. మొక్కలకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిచాలని ఆదేశించారు. ప్రార్థన మందిరాలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణంలో నాటిక మొక్కలు ఎండుముఖం పట్టకుండా వాటిని కాపాడాల్సిన అవసరం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నమెంట్

మరికల్: మండలంలో ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20నుంచి 21వరకు జరిగే ఈ పోటీలకుగాను క్రీడాకారులు తమ జట్ల పేర్లను నమోదుచేసుకోవాలని సూచించారు. పోటీలు ముగిసిన తర్వాత విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



నారాయణపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు



మాగనూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి

నారాయణపేట రూరల్ : పురిట్లోనే ఆడపిల్లలను అంతం చేసే సంస్కృతికి చర మగీతం పాడాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నా రు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రాంతానికి వెళ్లి వారికి ఆడపిల్లల ప్రాధాన్యతను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో రకాల పథకాలతో ఆడపిల్లలను ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంస్థ జండర్ స్పెషలిస్ట్ నర్సింహ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని అప్పక్‌పల్లి, జాజాపూర్, తిమ్మారెడ్డిపల్లితండా గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రాంతాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి 200రోజులు పని కల్పించాలని, రోజువారి కూలీని రూ.600కి పెంచాలని డిమాండ్ చేశారు. వేసవిలో ఎండలు మండిపోతున్న కనీస సౌకర్యాలు కల్పించలేదని, నీడ కోసం టెంట్లు, తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, ఆశప్ప, బస్వరాజ్ పాల్గొన్నారు.

మాగనూర్: ఉపాధిహామీ పథకం పనులను రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నేరడగంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి మాట్లాడారు.. కూలీలకు రోజువారీగా పడుతున్న వేతనం అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క కూలీకి రోజుకు రూ. 300 వచ్చేలా పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్, ఫీల్డ్‌అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్



కొత్తపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మద్దూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైనా కొత్తపల్లి, నిడ్జింత గ్రామాల్లో కేంద్రసాయుధ పోలీసు బలగాలు ఫ్లాగ్‌మార్చ్ శుక్రవారం నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికే ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ రాంలాల్ తెలిపారు. ప్రజలకు ఎన్నికలపై అభద్రతభావం లేకుండా భరోసా కల్పిస్తామని ఆయన తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

కోస్గి: పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీ పరీక్షలో ప్రతిభ చూపారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన మొత్తం 58మంది ఈ పరీక్ష రాయగా భానుప్రియ రాష్ట్రస్థాయి 2వ స్థానం, తేజ ప్రహస్ రాష్ట్రస్థాయి 5వ స్థానం సాధించారు. మరో 38మంది ప్రతిభ చూపి ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించింది. కార్యక్రమంలో ఏజీఎం భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ రమేష్‌కుమార్, డీన్ వినయ్‌కుమార్, ప్రైమరీ ఇన్‌చార్జి అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు



ప్రమాదకరంగా మారిన రోడ్డు

మాగనూర్: మండల పరిధిలోని వాడ్వట్ నుంచి మందిపల్లికి వెళ్లే రహదారిలో మలుపులతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న అధికారులలో మాత్రం చలనం లేకుండా పోయింది. చాలా సార్లు అధికారులకు విన్నవించినా ఈ దారిలో కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో రైతులకు అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఎక్కడబడితే అక్కడ రోడ్డును తొవ్వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డు ఏర్పాటుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సీఎం సభకు తరలిన నాయకులు



మక్తల్ నుంచి తరలివెళ్తున్న నాయకులు



ఊట్కూర్‌నుంచి..

మక్తల్: పాలమూరు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు శుక్రవారం మక్తల్ నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా తరలివెళ్లిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రవీకుమార్, మాగనూర్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కావలి తాయప్ప, శంశోద్దిన్, గోవర్ధన్ ఉన్నారు.

ఊట్కూరు: మహబూబ్‌నగర్ పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నామినేషన్‌ల కార్యక్రమానికి మండలం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఊట్కూరు, పగిడిమారి, చిన్నపొర్ల, పెద్దజట్రం తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యదీశ్వర్‌రెడ్డి, నాయకులు ఎల్కోటి నారాయణరెడ్డి, కుర్వ శ్రీనివాస్, సూర్యప్రకాష్‌రెడ్డి, రాఘవరెడ్డి, కనకప్ప, బషీర్‌అహ్మద్, ఇబ్రహీం తదితరులు వెళ్లారు.

దామరగిద్ద: పాలమూరు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి నామినేషన్‌కు మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్‌నాయకులు తరలి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాఘవేందర్‌గౌడ్, ఎంపీటీసీ బస్వరాజ్, పరిపూర్ణం, ఖాజా, హన్మంతు, మహిపాల్‌రెడ్డి, నింగప్ప, మాజీ ఎంపీటీసీ బాలప్ప, గోవింద్, భగవంత్‌రెడ్డి ఉన్నారు.

యథేచ్ఛగా జూదం!

మాగనూర్: మండలంలో యువత చెడు మార్గాల వైపు దూసుకుపోతున్నారు. యథేచ్ఛగా జూదంకోసం పరుగులు తీస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో యువత పేకాట కోసం చేసే పనులను సైతం వదిలి, బానిసలుగా మారుతున్నారు. జూదరులకు వాగు పరిసర ప్రాంతాలను వేదికలుగా చేసుకుని పేకాట ఆడేస్తున్నారు. పోలీసుల దృష్టిలో పడకుండా ఒకచోట కొందరిని కాపల ఉంచి ఈ జూదాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ఇక్కడ రూ. లక్షల్లో పేకాట నడుస్తున్న పోలీసులకు తెలియదా! అని కొందరు మండల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఇప్పటికైనా స్పందించి వీరిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నేరడగందొడ్డి శివారులో పేకాట ఆడుతున్నట్లు ఉన్న ఆధారాలు